క్లుప్తంగా

నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి ధ్వజ స్తంభం ప్రతిష్ట

మునగపాక: నాగులాపల్లిలోని పాటిమీద శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు టి.ఎ.వి.తులసీరామ్, కె.ఎ.వి.సుబ్రహ్మణ్యం, ప్రకాష్‌లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. వేద పండితులు శ్రీమాన్ చక్రవర్తులు, వెంకటలక్ష్మి భవన్ నారాయణాచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగే కార్యక్రమానికి భక్తులు తరలిరావాలన్నారు. వేంకటేశ్వరస్వామి పల్లకీ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో జరిగే పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం: ఉపాధి కూలీలు ఎండ తీవ్రతకు జాగ్రత్తలు తీసుకుని పనులు చేయాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. జీపీపాలెం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులు పరిశీలించారు. కొలతలు ప్రకారం పనులు చేయించి గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేయాలన్నారు. పరిశీలనలో ఏపీవో సత్యవతి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లిటౌన్: పట్టణంలో గవరపాలెం కామాక్షమ్మ ఆలయంలో ప్రతిష్టించబడిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఇటీవల ప్రతిష్టించిన స్వామివారి విగ్రహానికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. ప్రతి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు



మట్టి ట్రాక్టర్లను పట్టుకున్న అధికారులు

ఎస్.రాయవరం: గ్రామాల్లో అక్రమ మట్టి తవ్వకాలు, ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్యామ్ హెచ్చరించారు. మండల కేంద్రం మీదుగా ఉప్పరాపల్లి గ్రామంలో మట్టి తవ్వకాలు చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. దార్లపూడి సమీపం వరహానది నుంచి ఇసుక తరలిస్తున్న 7 నాటు బళ్లను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ



భక్తులకు దర్శనమిచ్చిన పైడిమాంబ అమ్మవారు

రాంబిల్లి: రాంబిల్లిలో మంగళవారం పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమ సమరించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం తీర్థ మహోత్సవాన్ని నిర్వహించారు. బాణసంచా కాల్చారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పుస్తక పఠనం, కథలు చెప్పడంపై సాధన

కోటవురట్ల: గ్రంథాలయాలలో వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, కథలు చెప్పడంపై సాధన చేయించారు. రీసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయుడు మస్తాన్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డలకు ఆరోగ్య సందేశం...కిల్కారీ

- మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం
- కిల్కారీ సేవలపై అంగన్‌వాడీ, ఆశలకు అవగాహన





కిల్కారీ సేవలకు సంబంధించిన పోస్టర్, అవగాహన పొందుతున్న ఆశ కార్యకర్తలు

మునగపాక: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది. ప్రతి వారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాయిస్‌కాల్ వస్తుంది. ఈ వాయిస్ కాల్ నిమిషం 30 సెకెండ్ల పాటు ప్రతి గర్భిణీ వినేలా కిల్కారీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

సందేహాల నివృత్తి

మహిళ గర్భిణిగా ఉన్నప్పుడు స్థానికంగా ఉండే ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలను నమోదు చేసేటప్పుడు ఫోన్ నంబరును నమోదు చేస్తారు. ఆ నంబర్‌కు కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయి. గర్భిణుల్లో తలెత్తే పలు సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుంది. మహిళ గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, అలాగే బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్ రూపేణా సందేశాలు వస్తాయి.

01244588000 నుంచి వాయిల్‌కాల్

గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైల్‌కు ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. ఈ వాయిస్ కాల్ సుమారు నిమిషం 30 సెకెండ్ల పాటు ఉంటుంది. గర్భిణులు బిజీగా ఉండి ఫోన్ లిఫ్ట్ చేయని పరిస్థితిలో ఐవీఆర్ సిస్టమ్ ఆటోమెటిక్‌గా ఒకేరోజు మూడుసార్లు ఫోన్ కాల్స్ వచ్చేలా చేస్తుంది. మరలా సంబంధిత సందేశాలను వినాలని అనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబరుకు డయల్ చేసి వినే సౌకర్యం కూడా కిల్కారీ ద్వారా కల్పించారు.

ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ

కిల్కారీ సేవలకు సంబంధించి పీహెచ్‌సీల ద్వారా ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి నెలా మొదటివారం జరిగే ఆశ కార్యకర్తలకు ఈ సేవలకు సంబంధించి వైద్యాధికారులు పదే పదే అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భోజన సదుపాయం, పోషక విలువలు కలిగిన ఆహారం పొందేందుకు వచ్చే గర్భిణులకు కిల్కారీ సేవలకు సంబంధించిన వీడియో చూపించేలా చర్యలు తీసుకున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిల్కారీ వాయిస్ కాల్స్ తప్పక వినడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియచేసేలా కార్యక్రమం రూపొందించారు.

సద్వినియోగం చేసుకోవాలి



మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం కిల్కారీ సేవలు అందుబాటులోకి తీసువచ్చింది. దీని ద్వారా గర్భిణులు, పిల్లల ఆరోగ్యానికి సంబంధించి సందేశాలు లభిస్తాయి. వాయిస్ కాల్ వినడం ద్వారా గర్భిణులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించే ఈ మహత్తర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–పి.అనిల్‌కుమార్, వైద్యాధికారి, మునగపాక

అందరికీ సంక్షేమం చేరుతోంది..



పాములవాకలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు ఆసరా కల్పిస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పాములవాకలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత సచివాలయం, ఆర్బీకే నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూనే గ్రామీణ స్థాయిలో సుపరిపాలన అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమ పథకాల నిధులు మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో ఒక్క బటన్ నొక్కి జమ చేస్తున్నారన్నారు. చిన్నారులకు బంగారు భవితను అందించడమే కాకుండా వారి చదువుకు ఇబ్బంది పడకుండా తల్లుల అకౌంట్లలో నగదు జమ చేస్తున్నారన్నారు. ఆర్బీకేల ద్వారా రైతు ముంగిటకే సమస్త సేవలు అందుతున్నాయన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా సకాలంలో జరుగుతోందన్నారు. వైద్య సేవలు కూడా ప్రజల ముంగిటకే చేరుతున్నాయని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు చేసుకోవాలన్నారు. జగన్ చేపట్టిన సంస్కరణలతో అక్రమాలకు తావులేదన్నారు. అవ్వా తాతలకు ఒకటో తేదీనే నేరుగా వారి ఇంటికే పింఛను అందుతోందన్నారు. ఇటువంటి సంక్షేమాన్ని గతంలో ఎపుడైనా చూశారా అన్నారు. గతంలో చంద్రబాబు ఎటువంటి హామీలతో ప్రజలను మోసం చేశారో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. నిరుద్యోగ భృతి హామీతో నిరుద్యోగ యువతను కూడా మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మళ్లీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేయాలనే ప్రణాళికతో మోసపూరిత హామీలతో సిద్ధమయ్యారని, తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు. రానున్న ఎన్నికలల్లో విజ్ఞతతో ఆలోచన చేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందించి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, సర్పంచులు సత్యవతి, కోసూరు అప్పారావు, శింగంపల్లి ఎరుకునాయుడు, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ నాయకులు రొంగల వెంకటరమణ, బాబులు, సోలో రమణ, ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. శిబిరానికి డాక్టర్ అనిల్‌కుమార్ సేవలందించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, ఏఎన్ఎం రేవతి పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



పెనుగొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: గ్రామాల్లో దోమల బెడద పెరగకుండా చర్యలు తీసుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి సూచించారు. మలేరియా మాసోత్సవాలు పురస్కరించుకుని పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో విధిగా ఫ్రైడే డ్రై డే పాటించి దోమలు పెరగకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇళ్లలో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు.

ద్వాక్రాసంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు

డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి



పూతరేకుల వ్యాపారం చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న పీడీ లక్ష్మీపతి

నక్కపల్లి: డ్వాక్రా సంఘాలకు రూ.10 నుంచి రూ.20లక్షల వరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో స్త్రీ శక్తి భవనంలో డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు, ఆటోల్లోను ద్విచక్ర వాహనాల్లోను పరిమితికి మించి ప్రయాణించరాదని సూచించారు. మహిళల్లో రక్తహీనత గురించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. బాల్యవివాహాలను అరికట్టాలని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయసులో మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చిన్నపిల్లల్లో అవగాహన కల్పించాలన్నారు. స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించే వారికి రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని స్వయం ఉపాధి కార్యక్రమాలు, వ్యాపారాలు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారి వ్యాపారాలు లాభనష్టాలను గురించి తెలుసుకున్నారు. వేంపాడులో పూతరేకులు తయారు చేస్తున్న మహిళ కుటుంబాన్ని ఆయన పలకరించారు. ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత వ్యాపారం జరుగుతోందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం సునీత, ఏరియా కో ఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎం ఉషాదేవి, మేనేజర్ కరుణానిధి, సీసీ రాజు, ప్రకాష్, గ్రామసంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆవ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలి



నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకుడు అప్పలరాజు

పాయకరావుపేట: స్థానిక ఆవ చెరువులో నిబంధనలకు వ్యతిరేకంగా మట్టిని తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారని, అధికారులు మట్టి రవాణాను నిలుపుదల చేయాలని సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజు, నీటి పారుదల శాఖ ఏఈ డి.లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్‌లకు వేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టిని ప్రైవేటు వ్యక్తులు రవాణా చేయడానికి ఇచ్చిన అనుమతులను నీటి పారుదల శాఖ అధికారులు రద్దు చేయాలని ఆ ఫిర్యాదులో కోరారు.

వెలవెలబోయిన వారపు సంత



రాంబిల్లిలో వారపు సంత

రాంబిల్లి: వడగాడ్పుల దెబ్బకు రాంబిల్లిలో మంగళవారం వారపు సంత వెలవెలబోయింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వడగాడ్పులు కొనసాగాయి. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. జనం ఇళ్లకే పరిమితమయ్యాయి. వారపు సంతలో వ్యాపారులు ఎండదెబ్బకు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలుదారులు రాకపోవడంతో వ్యాపారం సాగక ఉసూరుమన్నారు. రాంబిల్లి వారపు సంత ప్రతి వారం మంగళవారం జరుగుతుంది. దాదాపు 15 గ్రామాల నుంచి ప్రజలు ఇక్కడ సంతకు వచ్చి కొనుగోళ్లు చేస్తుంటారు. అయితే ఈ మంగళవారం మాత్రం సంత జనం లేక వ్యాపారం ఆశించినంత జరగక వ్యాపారులు దిగాలు చెందారు.

ఈదురు గాలులు, మెరుపులతో వర్షం

నేలకొరిగిన వృక్షాలు



యలమంచిలిలో కురుస్తున్న వర్షం



మున్సిపల్ కార్యాలయంలో కూలిన భారీ వృక్షం

యలమంచిలి : యలమంచిలి పట్టణంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల బీభత్సానికి మున్సిపల్ కార్యాలయంలో ఉన్న భారీ వృక్షం నేలకొరిగింది. పట్టణంలో రహదారులపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలి కారణంగా పట్టణం విద్యుత్ కోతలతో అంత అంధకారం అయింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు గాలులు వీచాయి.

కాలుష్య నివారణ మన చేతుల్లోనే...

కాలుష్య నియంత్రణపై కళాజాత



యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కళాజాత ప్రదర్శన

యలమంచిలి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం ఉదయం కాలుష్య నియంత్రణపై కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలతో జిల్లాలో కళాజాత ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. హాస్యరస సన్నివేశాలు, పాటలతో ఈ నాటిక ప్రదర్శనలో కాలుష్య నియంత్రణ గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచిస్తున్నారు. ప్లాస్టిక్ భూమిలో త్వరగా కరగదని, ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల దాని నుంచి విషవాయువులు ఉత్పన్నమై ప్రజలకు ఊపిరితిత్తుల వ్యాధులు, శ్వాసకోశవ్యాధులు, కేన్సర్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ సంచులు వాడకం మాని గుడ్డ సంచులు, నార సంచులు వాడాలని తెలిపారు. కాలుష్య నివారణ మన చేతుల్లోనే ఉందని మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని కళాజాత ప్రదర్శనల ద్వారా చైతన్య పరిచారు. కార్యక్రమంలో వి.శాంతారామ్, వై.చిరంజీవి, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ



రైతులకు పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్న మల్లవరం సర్పంచ్ హేమలత

మునగపాక: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత తెలిపారు. మల్లవరంలో మంగళవారం జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు ఆమె పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. గతంలో పట్టాదారు పుస్తకం కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతుల చెంతకే పట్టాదారు పుస్తకాలు అందిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత ఇందల నాయుడు, సచివాలయ కన్వీనర్ చిట్టికుమార్, రమేష్, వలంటీర్లు దమ్ము శివ, శ్రావణి, వార్డు సభ్యులు బండ పైడిరాజు, అప్పికొండ భారతి, రైతులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే పోలవరం పూర్తి



వీసం రామకృష్ణ

నక్కపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితీరుతుందని ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సొంత ప్రయోజనాల కోసం, కేసుల నుంచి కాపాడుకోవడం కోసమే జగన్ ఢిల్లీ వెళ్తున్నారని చౌకబారు ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా కేంద్రంతో సఖ్యత ఏర్పాటు చేసుకుని రాష్ట్రానికి రావాల్సిన నిధులను జగన్‌మోహన్‌రెడ్డి రాబడుతున్నారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి చెల్లించాల్సిన రెవెన్యూ లోటు రూ.10 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం నెల రోజుల క్రితం విడుదల చేసిందన్నారు. తాజాగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.12 వేల కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే జగనన్న ఢిల్లీ వెళ్తున్నారని, చంద్రబాబు మాదిరిగా కేసుల నుంచి కాపాడాలని, అరెస్టుల నుంచి రక్షించాలని ప్రాధేయపడడం కోసం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను నాలుగేళ్లపాటు నిరాటంకంగా అమలు చేస్తున్న ఘనత జగనన్నదేనన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగనన్నదే అధికారమన్నారు.

వెంకటాపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన



రైలు ప్రమాద మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ



దిమిలి గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మునగపాక: ఒడిస్సాలోని జరిగిన రైలు ప్రమాద మృతులకు సంతాపంగా మంగళవారం రాత్రి మండలంలోని వెంకటాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రైలు ప్రమాదం సంఘటన బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తగు న్యాయం చేయాలన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కొవ్వొత్తుల ప్రదర్శన గ్రామంలో అన్ని వీధుల గుండా సాగింది.

బాలాసోర్ రైలు ప్రమాద మృతులకు నివాళి

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. రీసోర్స్‌పర్సన్ టి.వెంకటలక్ష్మి, లైబ్రేరియన్ ఎస్. శకుంతల విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించారు. నీతికథలు చెప్పారు. చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. బాలాసోర్ రైలు ప్రమాద మృతులకు నివాళులు అర్పించారు.

నాగులాపల్లిలో ఘనంగా శోభాయాత్ర



నాగులాపల్లిలో శోభాయాత్ర

మునగపాక: నాగులాపల్లిలో మంగళవారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. నూతన రామాలయం నిర్మాణంలో భాగంగా ఈ శోభాయాత్ర ఏర్పాటు చేశారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు నినదించారు. బుధవారం ఆలయ శంకుస్థాపనకు అవసరమయ్యే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి పల్లకీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించండి



కాలి నడకతో తమ పరిస్థితిని వివరిస్తున్న చిన్నారులు

కోటవురట్ల: గిరిజన గ్రామాల పట్ల అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, పథకాలు తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. ఈ సందర్భంగా గొట్టివాడ శివారు అణుకు గిరిజనులు మంగళవారం తమ ఇబ్బందులను వివరిస్తూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా చిన్నారులు విద్యకు దూరమవుతున్నారని, అణుకులో పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల పథకాలు అందుకోవాలంటే కొండలు, గుట్టలు దాటుకుని సిగ్నల్ ఉన్న ప్రాంతానికి సుమారు 3 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 15 మందికి పింఛన్లు వస్తున్నాయని, అందులో ముగ్గురు బాగా వృద్ధులు కావడంతో డోలీలో మోసుకెళ్లి పింఛను తెచ్చుకోవలసి వస్తోందని వాపోతున్నారు. రేషన్ కోసం 8 కిలోమీటర్లు నడుస్తున్నామని, తమ గ్రామంలోనే సిగ్నల్ వచ్చేలా ఏర్పాటు చేసి పథకాలు ఇక్కడే అందివ్వాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువు కోసం తాము పడుతున్న ఇబ్బందిని వివరిస్తూ రాళ్లు తేలిన రహదారిలో నడిచి నిరసన తెలిపారు.

రామచంద్రపురంలో గడప గడపకు నేడు

కోటవురట్ల: రామచంద్రపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. స్థానిక సమస్యలు వివరించేందుకు గ్రామస్తులు సిద్ధంగా ఉండాలని, అధికారులు ప్రజాప్రతినిధులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని సూచించారు.

10న నరాలవ్యాధిపై అవగాహన సదస్సు

అనకాపల్లి టౌన్ : స్థానిక గౌరీ గ్రంథాలయంలో ఈనెల 10న నరాలవ్యాధి చికిత్స అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూక అప్పారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు అంతర్జాతీయ న్యూరో సర్జరీ నిపుణుడు మళ్ల భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

ఘనంగా తుంపాలమ్మ పండగ

కశింకోట: అచ్చెర్ల గ్రామంలో మంగళవారం తుంపాలమ్మ వారి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తుంపాలమ్మ వారిని అందంగా నగలు, పూలతో అలంకరించి పూజలు చేశారు.